క్లుప్తంగా

పామర్రులో 30 కేజీల పండుగప్ప లభ్యం



పామర్రు: స్థానిక మూలమలుపుల వద్ద ఉన్న లోయస్ పుల్లేరు కాలువలో ఓ జాలరి వేసిన వలలో సుమారు 30కేజీల పండుగప్ప దొరికిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం జాలరి పుల్లేరులో వల విసరడంతో దానిలో ఎప్పుడూ లేని విధంగా పెద్ద పండుగప్ప పడింది. ఈ ప్రాంతంలో ఇటువంటి సంఘటన జరగడం ఇదే ప్రథమం కావడంతో స్థానికులు ఆసక్తిగా చేపను చూశారు. తర్వాత ఆ పండుగప్పను కాటా వేయగా 30కేజీల వరకు వచ్చింది. దీని విలువ సుమారు రూ.15వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందని జాలరులు చెబుతున్నారు.

7న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో 7వ తేదీన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు స్వామి వార్లకు పంచామృత అభిషేకం, తొమ్మిది గంటలకు స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ గురజాడ ఉదయ్ శంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తామని తెలిపారు.

విధుల్లో చేరిన పామర్రు గ్రూపు దేవాలయాల మేనేజర్



పామర్రు: పామర్రు గ్రూపు ఆఫ్ దేవాలయాల మేనేజర్‌గా జన్ను వెంకటేశ్వరరావు బుధవారం విధులలో చేరారు. గతంలో ఇక్కడ పని చేసిన కందుల వెంకట్రరెడ్డి బదిలీపై విజయవాడకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తిరువూరు నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు. 15 దేవాలయాలు ఉన్న ఈ గ్రూపులో ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల దైవ కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. స్థానిక ప్రజలు కూడా అన్ని రకాలుగా సహకరించాలని కోరారు. అనంతరం పలు ఆలయాల అర్చకులు, ఈవో ఎస్‌వీ సుబ్బారావు, గుమాస్తా కె. ప్రభాకర్‌రెడ్డి ఆయనను అభినందించారు.

గ్రంథాలయ శాఖకు సెస్ చెల్లించండి



గుడివాడ టౌన్: నిబంధనల ప్రకారం పురపాలక సంఘం నుంచి గ్రంథాలయ శాఖకు రావలసిన సెస్ మొత్తాలను విడుదల చేయాలని మచిలీపట్నం గ్రంథాలయ శాఖ ప్రతినిధి ఐవీవీ రామారావు కోరారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సెస్ బకాయిలు చెల్లించాలని కోరారు. స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయం భవనంలో మరమ్మతులు, ఇతర వసతులు ఏర్పాటు చేయడానికి నిధులు అవసరమైనందున సెస్ సొమ్ముతో అవసరాలు తీర్చుకోవలసిందిగా గ్రంథాలయ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరలో 75 శాతం మొత్తాలను గ్రంథాలయ శాఖకు అందజేసేలా కృషి చేస్తామని అందుకు సంబంధించిన వివరాలు కార్యాలయ సిబ్బందికి అందజేయాలని కమిషనర్ గ్రంథాలయ శాఖ ప్రతినిధులకు సూచించారు. గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సీసీ కెమెరా అవసరం



కైకలూరు/ముదినేపల్లి రూరల్: ఇంటికి సీసీ కెమెరా ఏర్పాటు చేసుకుంటే రక్షణ కవచంలా ఉంటుందని రూరల్ సీఐ వి.రవికుమార్ అన్నారు. గురువారం సీసీ కెమెరాల ఉపయోగాలపై కలిదిండి, ముదినేపల్లి గ్రామాల్లో ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల అమరిక వీధి దిక్కున కనిపించేటట్లుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు దర్యాప్తునకు ఉపయోగపడతాయన్నారు. ఒక సీసీ కెమెరా పదిమంది పోలీసు సిబ్బందితో సమానమన్నారు. నేరం జరిగిన తర్వాత బాధపడే కంటే నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ఉత్తమమని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో కలిదిండి, ముదినేపల్లి ఎస్సైలు వెంకటేశ్వరరావు, వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకకు వేళాయె

నేటి నుంచి సుబ్బారాయుడి కల్యాణోత్సవాలు



శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయ రాజగోపురం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా మార్గశిర మాసంలో ఈ ఉత్సవాలు 13 రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అదే విధంగా ఈ ఏడాది ఈ నెల 6 నుంచి 18 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర..

స్వామి వారి ఆలయాన్ని 1854లో గ్రామస్తులు నిర్మించారు. ఇందుకు సంబంధించి ఒక కథ స్థానికంగా ప్రచారంలో ఉంది. సింగరాయపాలెం బావాజీ మఠంలో ఉన్న ఒక పుట్టలో నుంచి దేవతా సర్పం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చెరువులోకి వచ్చి తిరిగి వెళుతుండగా.. చేవూరుపాలేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపరచడంతో పాము మరణించింది. అయితే గాయపర్చిన ఆ ఇద్దరికి కంటిచూపు పోగా.. ఆలయాన్ని నిర్మిస్తామని వేడుకోవడంతో చూపు వచ్చినట్లు చెబుతారు. దీంతో గ్రామస్తులు ఐక్యంగా సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాన్ని నిర్మించారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ఆలయాన్ని 1987లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది.

విశేష కార్యక్రమాలు..

ఈ ఏడాది ఉత్సవాలకు సంబంధించి పలు విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శుక్రవారం పంచమి తిథిలో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. షష్ఠి తిథి రోజున అనగా 7వ తేదీ రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం వేడుకగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా 9న స్వామి వారి కల్యాణ రథోత్సవం, 10న తెప్పోత్సవం నిర్వహిస్తారు. అదే విధంగా 11న ఏకాదశ మహా రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, సహస్ర దీపారాధనలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా 13న త్రయోదశి సందర్భంగా సుబ్రహ్మణ్య హవనం 15న పుష్పశయ్యాలంకృత పర్యంక సేవ 18న అఖండ అన్నసమారాధన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విజయవంతం చేస్తాం..

స్వామి వారి కల్యాణోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, భక్తుల సహకారంతో ఉత్సవాలు విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యుల నియామకం

ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలకు సంబంధించి పర్యవేక్షణకుగాను కమిటీ సభ్యులను ఏర్పాటు చేస్తూ దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవాలు ఈ నెల 6 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. వీటి పర్యవేక్షణకుగాను 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో బొంగు రవికుమార్, ఎనిగళ్ల సురేష్, నీలం శివరమేష్, పరసా కృష్ణ, బూరుబోయిన సోవమ్మ, పుట్టి సుబ్బలక్ష్మీ, దగాని నాగలక్ష్మీ, బెజవాడ నాగవెంకట రాధాకృష్ణ, పరసా రమేష్, చింతగుంట కనకదుర్గ ఉన్నారు. వీరితో శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.

వసతి.. దుస్థితి



శిథిలావస్థలో హాస్టల్ భవనం

ఆ సంక్షేమ హాస్టల్.. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శంగా నిలుస్తోంది. మొక్కలు మొలిచి ఊడి పడుతున్న శ్లాబ్.. నిర్వహణ సక్రమంగా లేక మూలకు చేరిన ఆర్వో వాటర్ సిస్టమ్.. వాష్ రూమ్స్ ఉన్నా లేనట్టే.. చాలీచాలని గదులు.. ఏదో పెట్టాం అన్నట్లు భోజనాలు.. వెరసి విద్యార్థులకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తోంది గుడ్లవల్లేరు మండలం కౌతవరంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం. ఈ హాస్టల్ మరమ్మతులకు రూ.11లక్షల నిధులు మంజూరైనా పనులు నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని కలిదిండి, నందివాడ, ఉయ్యూరు, గూడూరు, కైకలూరు మండలాల్లోని గ్రామాలకు చెందిన విద్యార్థులు వసతుల లేమి నడుమ వేరే గత్యంతరం లేక బతుకు జీవుడా అంటూ ఉంటున్నారు. - గుడ్లవల్లేరు



దాతలు ఇచ్చిన ఆర్వో వాటర్ సిస్టమ్ దుస్థితి ఇది



ఊడి పడుతున్న శ్లాబ్ పెచ్చులు

గౌతు లచ్చన్న విగ్రహంపై బురద



గుడ్లవల్లేరు: కౌతవరంలోని స్వాతంత్ర్య సమర యోధుడు దివంగత సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహంపై కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బురద చల్లారు. దీనిపై గురువారం టీడీపీ నేతలు ఆగ్రహించి లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. సమాచారం తెలుసుకున్న ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, విమానాశ్రయ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కామేపల్లి తులసిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. లచ్చన్న విగ్రహంతో పాటు జూనియర్ ఎన్టీఆర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఉన్న ఫ్లెక్సీపై కూడా గుర్తు తెలియని వ్యక్తులు బురద చల్లినట్లుగా నాయకులు, పోలీసులు గుర్తించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ముదినేపల్లి రూరల్: ప్రేమ, సంతోషాలు నింపడమే క్రిస్మస్ సందేశమని పాస్టర్లు బి.విజయకుమార్, ఎంఏ కిషోర్ అన్నారు. మండలంలోని ములకలపల్లి, లేమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సెమీ క్రిస్మస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపించిన క్రిస్మస్ గీతాలు విశ్వాసులను అలరింపజేశాయి. పాస్టర్లతో పాటు పలువురు విశ్వాసులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మోహనరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

• **ఆస్తిపన్ను బకాయిలు వెంటనే చెల్లించాలి**



భవన యజమానులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు

గుడివాడ టౌన్: దీర్ఘకాలిక ఆస్తిపన్ను బకాయిలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి పెద్ద మొత్తాలలో బకాయిలు ఉన్న ఆస్తిదారుల వద్దకు స్వయంగా వెళ్లి పన్ను చెల్లించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలోని పలువురు దీర్ఘకాలికంగా పన్ను చెల్లించకుండా బకాయిలు పడ్డారన్నారు. మున్సిపల్ సిబ్బంది సూచనల సైతం పట్టించుకోకపోవడంతో స్వయంగా అధికారులతో కలిసి ఆస్తి యజమానుల వద్దకు వెళ్లి ఒత్తిడి చేస్తున్నామన్నారు. పన్ను చెల్లించకపోవడం వల్ల కేవలం పెనాల్టీతోనే సరిపెట్టుకుందామంటే కుదరదని చట్టపరంగా ఇతర చర్యలు కూడా ఉంటాయన్నారు. పన్ను బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

• **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పమిడిముక్కల సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కపిలేశ్వరపురం, హనుమంతపురం, ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు, హనుమంతరాయపాలెం, అగినపర్రు, మామిళ్లపల్లి, బొడ్డువానిగూడెం, తెల్లాకులపాలెం, దేశన్నపాలెం, ముసలనాయికపాలెం, మగ్గాల మాలపల్లి, పోతురాజుమాలపల్లి, పమిడిముక్కల, వీరంకిలాకు, వీరంకి, అమీనపురం, మేడూరు, ముదిరాజుపాలెం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

• **సెక్యూరిటీల మార్కెట్‌పై పట్టు సాధించాలి**

గుడివాడ టౌన్: ఎంబీఏ విద్యార్థులు కెరీర్ పెంపొందించుకోవాలంటే సెక్యూరిటీల మార్కెట్‌పై పట్టు


సంక్షిప్త వార్తలు

సాధించాలని ముంబయికి చెందిన సెక్యూరిటీస్ మార్కెట్ ట్రైనర్ వి. నరేంద్ర అన్నారు. గురువారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో భారతీయ సెక్యూరిటీల మార్కెట్‌పై ఆర్థిక విద్య అనే అంశంపై జరిగిన వర్క్ షాపులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ కెరీర్ అవకాశాలు, పెట్టుబడి మార్గాల ప్రాముఖ్యత, ప్రారంభ పబ్లిక్ ఆఫర్, వర్చువల్ ఆధారిత ట్రేడింగ్, మ్యూచువల్ ఫండ్స్, సెబీ పాత్ర, భారతదేశపు సెక్యూరిటీ మార్కెట్, బిట్ నాణేల వ్యాపారం, క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ డిజిటల్ గోల్డ్, డిజిటల్ కరెన్సీ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• **నేడు అంబేడ్కర్ 67వ వర్ధంతి**

మండవల్లి: స్థానిక అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పది గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద 67వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, కార్యదర్శి కొండపల్లి వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

• **ఉపాధ్యాయుడి హత్యకు కారకులను శిక్షించాలి**



నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

గుడివాడ టౌన్: కడపజిల్లా రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏజీకే హైస్కూల్ ఎదురుగా ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తరగతి గదులలో ఉపాధ్యాయుల పైనే దాడికి పాల్పడటం దిగ్భ్రాంతికరమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు డి. చంద్రశేఖర్, ఏఎస్‌వి ప్రసాదు, పాండురంగారావు, రమేష్ పాల్గొన్నారు.

• **పాడి రైతులకు రూ.12.09 కోట్ల బోనస్**

పామర్రు: కృష్ణా జిల్లాలోని 1,52,00 పాడి రైతులకు నాలుగు నెలల కాలానికి రెండో విడత బోనస్‌గా రూ.12.09కోట్లను అందజేస్తున్నట్లు కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పాల శీతల కేంద్రంలో పాడి రైతులకు బోనస్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల ఉత్పత్తి దారుల ఆర్థిక అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తోందని అన్నారు. పామర్రు పాలశీతల కేంద్ర పరిధిలోని 9,396 మంది పాల ఉత్పత్తి దారులకు రూ.90,11,875లను అందిస్తున్నామని అన్నారు. యూనియన్ ఏజీఎం అన్వేష్‌కుమార్, ట్రస్టు బోర్డు జిల్లా డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• **నేడు జాబ్ మేళా**

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి తెలిపారు. కళాశాలలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించే ఈ జాబ్ మేళలో ఐసీఐసీఐ బ్యాంకు, నిట్, ఇసాన్ ఎక్స్‌పీరియన్సెస్, తారన బీపీఓ సర్వీసెస్ ఇండియా, ఎంఐవో, ఇన్నిలోన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, పానాసోనిక్, టాటా కెమికల్స్ లిమిటెడ్, కేఎంఎల్ ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, డీ మార్ట్, కర్ణాటక బ్యాంకుల్లో 521 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువత, చివరి సంవత్సరం చదువుతున్న డిగ్రీ విద్యార్థులు కూడా హాజరుకావచ్చని తెలిపారు.

• **షిర్డీ సాయికి విశేష పూజలు**

పామర్రు: స్థానిక సాయి నగర్‌లోని షిర్డీ సాయి మందిరంలో గురువారం స్వామికి విశేష పూజలను చేశారు. తొలుత బాబాకు ఆవుపాలతో, పంచామృతాలతో నవరసాలతో ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. అనంతరం శత సహస్ర నామాలతో పలురకాల పుష్పాలతో విశేషంగా పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్న హారతిని నిర్వహించారు. భక్తులందరికీ అన్న సమారాధన కార్యక్రమం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మా వినోద్‌రెడ్డి, ఆలయ అర్చకులు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యం.. ప్రజలకు శ్రేయస్కరం



భూమి ఆరోగ్యకార్డులను ప్రదర్శిస్తున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ



మంటాడలో పాల్గొన్న ఏడీఏ సునీల్

గుడివాడరూరల్: సహజ వనరైన మట్టిని సంరక్షించుకోవడం ప్రజలకు శ్రేయస్కరమని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, అర్బన్‌లోని నాగవరప్పాడు రైతు సేవా కేంద్రంలో ఘనంగా ప్రపంచ మట్టి దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల సహజ వనరు అని కొన్ని దశాబ్దాలుగా నేల ఆరోగ్యం క్షీణించి పోతుందన్నారు. అనంతరం భూమి ఆరోగ్య కార్డులను ప్రదర్శించారు. మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పురుగు మందులతో నేల కలుషితం

కైకలూరు: రసాయనాలు, పురుగు మందుల వాడకం వల్ల నేల కలుషితమవుతోందని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆర్.గంగాధరరావు అన్నారు. గురువారం వింజరం రైతుసేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పంటలో రసాయనాలు వినియోగిస్తే వాటి అవశేషాలు మానవ శరీరంలో ప్రవేశించి అనారోగ్యాలకు దారి తీస్తాయన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జయంగళ కనకదుర్గ పాల్గొన్నారు.

మట్టి ఆరోగ్యం.. మనందరి బాధ్యత

పమిడిముక్కల: భారత పౌరులుగా మట్టి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని గన్నవరం ఏడీఏ సునీల్ అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి మట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంటాడ రైతు సేవా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. రైతులతో భూసార ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో కనీసం 10 మంది రైతులు ఎప్పటికప్పుడు భూసారాన్ని పరిరక్షించుకొనేలా ప్రోత్సహించాలని ఏఓ గణేష్‌రెడ్డి వీఏఏలకు సూచించారు.

భూసారాన్ని కాపాడుకుందాం

ముదినేపల్లి రూరల్: రసాయనిక ఎరువుల కారణంగా నేలలు భూసారాన్ని కోల్పోతున్నాయని, వాటిని కాపాడుకునేందుకు రైతులు ముందుకు రావాలని మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా మండల స్థాయి అవగాహన కార్యక్రమం వడాలి రైతుసేవా కేంద్రం వద్ద గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ మాట్లాడుతూ రైతులు తరచూ భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఫణి ధూర్జటి



మాట్లాడుతున్న జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి ఫణి ధూర్జటి

పమిడిముక్కల: భూ సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం.ఫణిధూర్జటి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నవీన్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ సమస్యలతో పాటు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను కూడా తీసుకొంటామని, పరిష్కరించదగిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. మండలంలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం మద్రివాడ, 9న గోపువానిపాలెం, 10న తాడంకి, 11న గురజాడ, 12న మంటాడ, 13న హనుమంతపురం, 16న వీరంకి, 17న అమీనపురం, 18న ఫత్తేలంక, 19న పైడికొండలపాలెం, 20న పమిడిముక్కల, గుర్రాల్లంక, 21న వేల్పూరు, 23న ముళ్లపూడి, 26న ఐనంపూడి, 27న కపిలేశ్వరపురం, 28న ఐనపూరు, కూడేరు, 30న లంకపల్లి, లంకపల్లి లంక, 31న చెన్నూరివారిపాలెం, జనవరి 2న శ్రీరంగపురం, 3న కృష్ణాపురం, 4న మేడూరు, 6న చోరగుడి, 7న మామిళ్లపల్లి, అగినపర్రు, 8న పెనుమత్సలో గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు.

నేటి నుంచి ఈ గ్రామాల్లో..

• గుడివాడరూరల్: ఈనెల 6వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు గురువారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 6వ తేదీన రామనపూడి పంచాయతీ పరిధిలోని అల్లిదొడ్డి, కాశీపూడి గ్రామాల్లో, 9న బిళ్లపాడు, చిన ఎరుకపాడు, 10న సీపూడి, 11న తటివర్రు, 12న రామనపూడి, 13న చిరిచింతల, రామచంద్రాపురం, 16న నాగవరప్పాడు, 17న వలివర్తిపాడు, 18న బేతవోలు, 19న పెద ఎరుకపాడు, 20న బొమ్ములూరు, 21న గంగాధరపురం, 23న లింగవరం, 24న మెరకగూడెం, 26న మల్లాయపాలెం, 27న సిద్ధాంతం, 28న శేరీదింటకుర్రు, 30న చౌటపల్లి, 31న శేరీవేల్పూరు, జనవరి 2వ తేదీన శేరీగొల్వేపల్లి, 3న గుంటాకోడూరు, 4న కల్వపూడి అగ్రహారం, 6న మోటూరు, 7న దొండపాడు, 8న చిలకమూడి, సైదేపూడి గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

• మొవ్వ: మండలంలో ఈ నెల 6న ఉదయం గూడపాడులో, మధ్యాహ్నం మొవ్వ సచివాలయాలలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తహసీల్దార్ కె. మస్తాన్ తెలిపారు. 7న వేములమడ, కూచిపూడి, 10న బార్లపూడి(కూచిపూడి), 11న పెదపూడి, యద్దనపూడి, 12న భట్లపెనుమర్రు, పెడసనగల్లు, 13న చినముత్తేవి, అయ్యంకి, 17న నిడుమోలు, మంత్రి పాలెం, 18న అవురపూడి, పాలంకిపాడు, 19న కాజ-1, కాజ-2, 20న కోసూరు, 21న పెదముత్తేవిలో సదస్సులు జరుగుతాయన్నారు.

• పెదపారుపూడి: మండలంలోని భూషణగుళ్ల సచివాలయం వద్ద శుక్రవారం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై. రంగారావు గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 9 గంటల నుంచి 1 గంట వరకు సదస్సు నిర్వహిస్తామన్నారు.

• గుడ్లవల్లేరు: మండలంలోని 24రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.లోకరాజు గురువారం తెలిపారు. ఈ నెల 6న చంద్రాల, చెరువుపల్లి, 7న శేరీ కల్వపూడి, 9న మామిడికోళ్ల, 10న పెసరమిల్లి, 11న వెణుతురుమిల్లి, 12న అంగలూరు, 13న గుడ్లవల్లేరు, 13న వేమగుంట, 16న పెంజెంద్ర, 17న చిత్రం, 18న డోకిపర్రు, 19న విన్నకోట, 20న కూరాడ, 21న శేరీ దగ్గుమిల్లి, 23న కౌతవరం, 24న వేమవరం, వేమవరప్పాలెం, నాగవరం, 26న ఉలవలపూడి, 27న వడ్లమన్నాడు, 28న గాదేపూడి, 30న చినగొన్నూరు, పురిటిపాడులో సదస్సులను చేపట్టనున్నామని చెప్పారు.

రసవత్తరంగా రైల్వే యూనియన్ ఎన్నికలు

కైకలూరు: భారతీయ రైల్వేలో యూనియన్‌ల గుర్తింపు కోసం రైల్వే బోర్డు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిలో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్‌కు సంబంధించి ఓటింగ్ ప్రక్రియ గురువారంతో ముగిసింది. జెండా గుర్తుపై ఎస్‌సీఆర్ఎంయూ తరఫున డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఎస్.రామగుప్త, సెక్రటరీగా ఎం.లీల, ఎస్ఈఆర్ఈఎస్ రైల్ ఇంజిన్ గుర్తుపై డివిజనల్ ప్రెసిడెంట్‌గా ఆకుల రాఘవేంద్రరావు, సెక్రటరీగా ఆమంచి వెంకటేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఈ రెండు యూనియన్ల తరఫున కైకలూరులో ప్రధాన పోటీ జరిగింది. రైల్వే స్టేషన్ వద్ద బుధవారం, గురువారం రెండు రోజులు ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. కైకలూరు రైల్వేస్టేషన్ పరిధిలోని స్టాఫ్, ఇంజినీరింగ్, ట్రాఫిక్ సిబ్బంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కైకలూరు పరిధిలో మొత్తం ఓట్లు 260 నమోదు చేయగా వీటిలో పోలింగ్ ముగిసే సమయానికి 224 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ నెల 12న పోలింగ్ ఫలితాలు వెల్లడవుతాయని, 30 శాతం ఓట్లు వచ్చిన యూనియన్‌కు గుర్తింపు వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

• **14న జాతీయ లోక్‌అదాలత్**

కైకలూరు: జాతీయ లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వీవీఎన్‌వీ లక్ష్మి గురువారం తెలిపారు. ఈ నెల 14న కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.